**శ్రీ రమణ జ్యోతి** **Sri Ramana Jyothi**

మార్చి 2022 March 2022

ఈ సంచికలో ... IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 92వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?** | బి. రవికృష్ణ శర్మ | 12 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 21 |
| **4.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 25 |
| 5. | Seek the Seeker | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Self-Knowledge (Part 2) | V. Krithivasan | 37 |
| 7. | Tales from Arunachalam | Swagat Patnaik | 43 |
| 8. | The Plunge into Siva's Grace | Marlies Hibschenberger | 48 |


**Events in Sri Ramana Kendram in March 2022**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 13th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 1st March - Mahasivarathri

(Devotees may please note that due to the ongoing Pandemic and local Government restrictions, the Kendram will remain closed, till further notice. Online satsangs will continue as usual. For details, please contact the Kendram office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# అసలైన అన్వేషణ

డా॥ కే.యస్. గారి 92వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

ఇతరుల అనుభవాలను విన్నప్పుడు మనం సాధారణంగా చలించిపోతాం. వాదనలకు బదులుగా ప్రతివాదనలు ఉండవచ్చు నేమో గాని అనుభవానికి ఎదురు వాదనలు ఉండవు. ప్రతి ఒక్కరి అనుభవమూ ఒక ప్రత్యేకమైనదే; అనుభవం జీవితంలో జరిగినది, సాధన ద్వారా ఏర్పడినది. తమ తమ నమ్మకాన్ని బలపరచు కొనడానికి అనుభవంగా రూపొందుతుంది. భగవాన్ లేదా దేవుని గురించి మనం సంపూర్ణంగా అవగాహన చేసుకునే మార్గమంటూ వుండదు. భగవాన్ గురించి మనం ఏమి చెప్పినప్పటికీ అది నిజం కావచ్చు కాని పూర్తిగా నిజం కానేరదు. మన సాధన, మన అధ్యయనం, వీటిని బట్టి మనం భగవాన్ గురించి ఒక అభిప్రాయా నికి వస్తాం. భగవాన్ గురించి పూర్తిగా అనుభవమైనది ఒక్క భగవాన్‌కే. మనమే భగవాన్ లేదా భగవంతుడైనప్పుడు నేరుగా చెప్పడానికి మరేమీ ఉండదు.

## మనకంటే వేరు ఉందా?

దేన్ని గురించి గాని వివరించడానికి ప్రయత్నం చేయడం అంటే, అది మనకంటే వేరు అన్న ఉద్దేశం ఉన్నప్పుడే జరుగుతుంది. నేను నీవే అయినప్పుడు క్రొత్తగా వివరించడానికి ఇక ఏమీ ఉండదు. నా గురించి ఓ మోస్తరుగా అర్థం చేసుకున్నప్పుడు నాతో ఎక్కువగా

మాట్లాడడం అనవసరమని మీకు అనిపిస్తుంది. ఒక చిరునవ్వు, ఒక సైగ సరిపోతుంది. అవగాహన లేనప్పుడు తగినంత మాట్లాడ వలసి వస్తుంది. అంటే, మనం భగవాన్‌ను లేదా భగవంతుడిని, జ్ఞానిని అర్థం చేసుకొనే ప్రయత్నాలు మన అవగాహనను మెరుగు పరచుకొనడానికే అన్న మాట. భగవంతుడి గురించి తెలుసుకొన డానికి కూడ ఆయన అనుగ్రహం అవసరం.

అవగాహన పరిపూర్ణమైనప్పుడు పూర్తి నిశ్శబ్దం, మౌనం చాలు. మౌనం ద్వారా వ్యక్తి అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. ఈ మౌనం అన్నది మానసిక మౌనం. భగవాన్ అలా చేసేవారు. స్వయంగా ఆయన దక్షిణామూర్తి. వర్ణించలేని శాంతిని ఆయన ప్రసరింప జేయగలిగేవారు. అది ఏ మాత్రం శరీర ధ్యాసలేని, వ్యక్తిత్వం లేని కారణంగా ఏర్పడినది. కష్టమని భావించకుండ, మనం ఉన్నతమైన కృపను భగవాన్ నుండి ఆశించాలి. ఉదాహరణకు మనం ఎన్నో ప్రదేశాలను సందర్శిస్తాము, ప్రశాంతత కోసం ఏవేవో చేస్తుంటాం. కాని ఒక దశ చేరేసరికి ఇష్టం కానిది, అలాగ అన్ని చోట్లకు వెళ్ళ లేము. తీర్థయాత్రలు చేయడం మంచిదే, సత్సంగాలలో పాల్గొనడం కూడ మంచిదే. వయస్సు మీరడం, ఇతర కారణాల వల్ల ఈ కార్యక్రమాలు చేయలేని ఒక స్థితికి చేరుకుంటాం.

## సులభ మార్గం

భగవాన్ కొన్ని విషయాల గురించి ఎంతో సరళమైన మార్గాలను చూపించారు, సూచనలను చేశారు. నిన్ను నీవు తెలుసుకో, అంతకంటే మరేమీ అక్కర లేదన్నారు. ప్రతిదానికీ మనం

ఏదో కారణాన్ని వెదుకుతాం, కారణాల కోసం మనం ఎల్లప్పుడూ అన్వేషిస్తూనే ఉంటాము. అలాంటప్పుడు అసలైన చివరి అన్వేషణ దేని కోసం అయ్యుండాలి? అంటే నేను ఎందుకు పుట్టాను, అసలు నేనెవరు అన్నదానికి కారణం తెలుసుకోవాలి కదా? మిగతా ఎన్నో విషయాలకు మనం అవగాహన సంపాదించినప్పటికీ, ఈ ప్రశ్నలకు సమాధానం మనకు బయట నుండి లభించదు. అందుకే నీవెవరో నీవు ప్రయత్నించి తెలుసుకోగలిగితే, అసలు ఇంక తెలుసు కోవలసినది ఏమీ ఉండదు. ఇది ఒక కష్టమైన విషయమని మనలో చాలా మందికి తెలుసు. కాని అలా కాదు, అతి సులభమని భగవాన్ అంటారు, నీకు నమ్మకం ఉంటే సరి. భగవాన్ కృప వుందని నమ్మకం కలిగితే, ఇక ఆ అన్వేషణ దానంతట అదే సాగుతుంది. మధ్యలో అడ్డంకులేవైనా వచ్చినప్పటికీ, పట్టించుకోకుండ, బాహ్యం వైపు వెళ్ళకుండ జరుగుతుంది.

భగవాన్ సాధకుల అవగాహన కోసం ఎన్నో కథలు చెప్పేవారు. వాటిని జ్ఞప్తి ఉంచుకోవడం ఎంతో అవసరం. ఒకసారి ఆయన గొప్ప యోగి అయిన నామ్‌దేవ్ గురించి చెప్పారు. నామ్‌దేవ్ విఠోబాతో స్వయంగా ప్రతిరోజూ మాట్లాడేవారు. ఒకరోజు నామ్‌దేవ్ కొందరు సాధువులతో కలిసి వున్నారు. అక్కడ వున్న జ్ఞాన్‌దేవ్, గోరకుంభ అన్న కుమ్మరితో "నీవు మంచి నైపుణ్యంగల కుమ్మరివి, ఇక్కడ ఇందరు సాధువులు ఉన్నారు. నీవు ఒక కర్రను తీసుకొని, ప్రతి ఒక్కరి తలను కర్రతో తట్టి, ఏ కుండ బాగా కాల్చబడింది, ఏది కాదు - అంటే ఎవరు భక్తితో పరిపక్వత చెందారో గమనించి చెప్పు" అన్నాడు. ఆ కుమ్మరి దాదాపుగ అక్కడ ఉన్న అందరి

తలలకు ఆ కర్రను తాకించాడు. నామ్‌దేవ్‌ను తాకబోతే అతను కోపంతో, ''నా భక్తి పక్వం చెందిందా అని నన్నే పరీక్షించబోతావా? ఎంత ధైర్యం? నేను విఠోబాతో మాట్లాడతాను. నా తలను తాకనివ్వను'' అన్నాడు. వెంటనే గోరకుంభ, ''ఇది పక్వం చెందని కుండ'' అని చెప్పాడు. ఆ మాట విన్న క్షణమే నామ్‌దేవ్ ఆ సాధువుల గుంపు నుండి విడిగా వచ్చి, వేరుగా విఠోబా దగ్గరకు వెళ్ళాడు. స్వామితో ''నేను నీ భక్తుడిని. ప్రతిరోజూ నీతో మాట్లాడతాను. జ్ఞాన్‌దేవ్ నన్ను ఈ రోజు అవమానించాడు. జరిగినది ఇది. నాలాంటి భక్తుడిని ఇలాగ జరగడాన్ని ఎలా సహించావు'' అని అన్నాడు.

## యద్భావం తద్భవతి

విఠోబా దాదాపు ''యద్భావం తద్భవతి'' అన్న అర్థం వచ్చేలాగు జవాబిచ్చాడు. ఇంకా నీవు నాతో మాట్లాడాలని కోరుకుంటావు. నేను నీతో ప్రతిరోజూ మాట్లాడతాను. నీవు నన్ను చేయమన్నది చేస్తాను. నీ కోరిక ప్రకారం నడుచుకొంటున్నాను. దానికి నామ్‌దేవ్ ''నీ జవాబు ఇది అయితే, సరే. కాని నిజంగా నీవెవరో తెలుసు కోవాలని ఉంది'' అని జవాబిచ్చాడు. ప్రభువు ''నేను ఎవరన్నది నేను చెప్పలేను, నేను చెప్పను. నా భక్తుడు ఒకడు ఉన్నాడు, అతని నుండి నీవు తెలుసుకోవచ్చు. అతను ఒక పాడుపడిన మంటపంలో ఉంటాడు. నేనెవరో అతను చెబుతాడు'' అన్నాడు.

వెదుకుకొంటూ వెళ్ళిన నామ్‌దేవ్ ఆ పాత మండపంలో ఒక వృద్ధుడు నేలమీద పడుకుని ఒక కాలిని శివలింగం మీద పెట్టి

వుండడం చూశాడు. బిత్తరపోయిన నామ్‌దేవ్ అలా చూస్తూ వుండగా, ఆ వృద్ధుడు ''నిన్ను విఠోబా పంపాడా? అని నామ్‌దేవ్‌ను అడిగాడు. దిక్కు తెలియని స్థితిలో వున్న నామ్‌దేవ్, అలాంటి దూర ప్రదేశంలో పడుకుని వున్న ఆ వయసు మళ్ళిన మనిషికి తాము విఠోబా దగ్గరి నుండి వస్తున్నట్లు ఎలా తెలిసిందని విస్తుపోయాడు. అందుకే ఆ వృద్ధుని ప్రవర్తన బాధ కలిగించినప్పటికి, అతనిలో ఏవో శక్తులు ఉండవచ్చునని తలచాడు. ''ఒక కాలిని శివలింగంపై వుంచడం అపరాధం కాదా, ఎందుకు అలా ప్రవర్తిస్తున్నావ''ని అడిగాడు నామ్‌దేవ్. ఆ వృద్ధుడు ''నేను ముసలివాడిని చూపు సరిగా లేదు చాలా బలహీనంగా వున్నానని నీకు కనిపించడం లేదా?'' అని అతని కాలిని తీసి మరొక చోటకు జరపమన్నాడు. నామ్‌దేవ్ అలాగే వృద్ధుని కాలిని శివలింగంపై నుండి తీసి ప్రక్కకు పెట్టబోతుంటే, ఆ చోట క్రొత్తగా శివలింగం పుట్టి, కాలి క్రిందికి పెరిగి వచ్చింది. అలాగ నామ్‌దేవ్ ఎన్నోసార్లు ప్రయత్నించినా, నేలమీద ప్రతిచోట కూడ కాలిక్రింద శివలింగాలు పుట్టుకొచ్చాయి. దాంతో ఆ వృద్ధుడు ఎవరో అసామాన్య వ్యక్తి అని నామ్‌దేవ్‌కు బోధపడింది. అప్పుడు ''నీవు క్రింద అని, పైన అని, ఏవేవో మాటలు అంటున్నావు. ఆయన లేని చోటు ఎక్కడా లేదు'' అని వృద్ధుడన్నాడు.

ఈ అనుభవం తరువాత నామ్‌దేవ్ ఇంటికి తిరిగొచ్చాడు. మామూలుగా అతను ప్రతిరోజూ గుడికి వెళ్ళేవాడు. ఇప్పుడు గుడికి వెళ్ళడం మానేశాడు. ఒకరోజు విఠోబా, నామ్‌దేవ్‌తో, ''ఏమైంది

నామ్‌దేవ్, ప్రతిరోజూ నీవు నా దగ్గరికి వచ్చి, నాతో మాట్లాడే వాడివి. ఏమైంది నీకు? నన్ను పూర్తిగా పట్టించుకోవడం మానేశావు?'' అని అడిగాడు. దానికి జవాబుగా నామ్‌దేవ్ ''నీ దగ్గరికి రావలసిన పని ఏముంది? నాకు అద్భుతమైన అనుభవాన్ని ఇచ్చావు. నా దగ్గరికి నీవు ఎందుకు రాలేదని అడిగావు. ''నీవు'' లేదు, ''నేను'' లేను. అందుకే నేను ఎక్కడికి వెళ్ళాల్సిన అవసరమూ లేదు'' అన్నాడు.

**అంతా ఒక్కటే**

నామ్‌దేవ్ దర్శించిన వృద్ధుడు అతనికి అపూర్వమైన అనుభవాన్ని ఇచ్చాడు: ''అంతా ఒకటే'' మనం సాధన చేస్తున్నప్పుడు మనకు అనుభవాలు కలుగుతాయి. కొన్ని సంతోషకరమైనవి ఉండవచ్చు. అలాంటి సందర్భాలలో, మనం భగవాన్ చెప్పినది గుర్తుంచుకోవాలి. మనం ధ్యానను మరవకూడదు. ఒకసారి భగవాన్‌ను ఎవరో ''భగవాన్, వృషభ వాహనం మీద శివుడు వచ్చి మీకు దర్శనమిస్తే, ఏ వరం అడుగుతారు'' అని అడిగారు. ఈ సందర్భాన్ని భగవాన్ కృపతో మనం గుర్తుంచుకోవాలి. శివుడు నాకు అలా దర్శనమిస్తే, ''నేను ప్రభూ! నన్ను మోసగించకండి, ఎందుకంటే మీరు నిరాకారులు'' అంటాను. భగవంతుడు మనకు బయట వేరుగా వుండడు. ఆయన మనలోనే ఉన్నాడు. ఇక వరం కోరే ప్రసక్తి లేదు. భగవాన్ ఎప్పుడూ ''దేని గురించి కూడ అడగ వద్దు'' అనేవాడు. నీకు ఏది మంచిదో ఆయనకు తెలుసు. నీకు ఏది అవసరమో ఆయనే ఇస్తాడు.

రైలుపెట్టెలోకి ఎక్కిన తరువాత, మన సామానును మన ఎత్తుకుని మోయము. ఆయనను నమ్ముతాము. మన భారాన్ని మొత్తం ఆయనే మోస్తాడు. పరిసరాల్లోని విషయాలను గురించి మనసును పోనీయకు. ఒక్కొక్కసారి భగవంతుడు కలలోనికి వచ్చాడని ఎంతో ఉద్రేకం పొందవచ్చు. అప్పటికి అది అలాంటి మనోభావాలను కలిగించవచ్చునేమోగాని అది శాశ్వతమైనది కాదని గుర్తించాలని భగవాన్ అంటారు. ఏదైనా వున్నది అంటే అది శాశ్వతంగా ఉండాలి. మనం సృష్టిత మాయలను అనుభవించడం, ఎవరో ఇతరులు చెప్పడం వంటివి వచ్చి, పోతుంటాయి. అలాంటి అనుభవాలు, భగవంతుడే తన ఇచ్ఛానుసారం ఇస్తాడు. దానికి సమయం ఆయన నిర్ణయిస్తాడు. మనం కాదు.

**మానసిక భావన**

ఉదాహరణకు, నేను తిరువణ్ణామలై వెళ్దామని అనుకున్నప్పుడు నేను ఆ రోజుకు టికెట్ కొందామనుకొంటా భౌతికంగా ఆ దినం అక్కడ ఉందామని. టికెట్ కొన్నప్పుడే మానసికంగా అక్కడ వున్నట్లు భావిస్తాం. అక్కడికి పోవడం లేదా రావడం అన్నది శారీరకంగా జరిగేది, మనసుకు సంబంధించినవి కావు. అలాగే సీతారామ శాస్త్రి ఎన్నో స్థలాలకు వెళ్దామనుకొన్నారు. అలాగ చేద్దామని అనుకున్న రోజునే, మానసికంగా ఆ ప్రదేశాలకు వెళ్లినట్లు భావించి వుంటారు. జరిగేదేమిటంటే, పవిత్రమైన ప్రదేశాలకి వెళ్ళాలన్న ఆలోచన వచ్చిన వెంటనే మనసు ప్రశాంత మౌతుంది.

బద్రీనాథ్, కేదార్‌నాథ్, తిరువణ్ణామలై సందర్శించా లన్నప్పుడే మీరు అక్కడ వున్నారు. శరీరం యథార్థంగా 15-20 రోజుల తరువాత చేరవచ్చు. కాని అసాధారణ విషయమేమంటే, శారీరకంగా మీరు ఆ స్థలాల్లో ఉన్నప్పుడు మీ మనసు మీ కుటుంబాలతో ఉంటుంది. ఇంట్లో అందరూ బాగున్నారా అన్న చింతలు మొదలౌతాయి. అందుకే భగవాన్ నీవు ఎక్కడ ఉన్నావో, అక్కడే తిరువణ్ణామలై ఉంది అని అన్నారు.

మరొక విషయం. మనం కలిసే దాదాపు ప్రతి ఒకరూ, నా దగ్గరికి రా, నీకు శాంతి నిస్తాను అంటారు. భగవాన్ జీవితకాలంలో కూడ, ఎవరైనా ఆయనతో అక్కడే ఉంటాము, ఆయనను వదలి పెట్టి వెళ్ళమని అంటే, భగవాన్ "వద్దు, అలాగ ఆలోచించవద్దు. నీవు ఎక్కడ ఉంటే తిరువణ్ణామలై అక్కడుంది" అని సర్ది చెప్పేవారు. ఆయన కృప వల్ల అలాగే జరిగేది. సమయం, స్థలాల గురించి ప్రస్తావించినప్పుడు, అవి శరీరానికి సంబంధించినవి. నేను బయట ఉన్నానని అంటే, అది శరీరాన్ని దృష్టిలో పెట్టుకుని అన్న మాట. మనసుకు సంబంధించినంత వరకు అది మానసికమైనదే. మనకు ఎప్పుడైన అనుమానం వస్తే కాలం, స్థలాన్ని, శరీరాన్ని గురించిన స్పృహ మనకు గాఢనిద్రావస్థలో అసలు ఉండవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ స్థితి మనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

## కృప లేనిదే సాధన కుదరదు

సాధన చేస్తున్న సమయంలో కూడ భగవంతుని కృపతోనే సాధన చేయగలుగుతున్నానన్న భావన బుద్ధిపరంగానే గాకుండ భావనాపరంగా సంపూర్ణంగా కలిగి వుండాలి. దాని అర్థం సాధన ఆయన కృప వల్లనే జరుగుతున్నదని అంగీకరించడం. సాధన సమయంలో ఏవో ఇతర విషయాల కారణంగా చింతించడం జరగవచ్చు. దానిని కూడ సాధనలో ఒక భాగమనే అభిప్రాయానికి రావాలి. నీవు ఎవరు అన్న తెలుసుకున్న తరువాత ఇతర సమస్యలు ఏవీ ఉండవు. ఆ నమ్మకం కొనసాగడంతో గమ్యాన్ని ఆయనే చేరుస్తాడు. అసలు భగవాన్ ఇందులో గమ్యం అంటూ ఏమీ లేదని, నీవు చేయవలసినది అనాత్మను తొలగించడంతో క్రొత్తదనమేమీ లేదని తెలియవస్తుంది.

బహు ప్రయత్నంతో ఈ విషయం అవగాహన జరిగిన తరువాత ఇంత చిన్నదానికై అంత గొప్ప ప్రయత్నం చేయాల్సి వచ్చిందేమి మీరే నవ్వుకుంటారు. నిజానికి, ఇది అంత బయటికి అనుకున్నంత సులభమైనది కాదు. మనసు పోకడలకు లొంగకుండ, అన్ని అనుమానాలు వదలి సాధనను సాగిస్తూపోతే, భగవంతుని కృపతో తగిన ప్రయత్నంతో ఫలితం లభిస్తుంది. మధ్యలో ఎదురయ్యే అడ్డంకులను పట్టించుకోము.

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?

బి. రవికృష్ణ శర్మ

ఉద్యోగరీత్యా నేను భౌతిక శాస్త్రాన్ని భోదించే ఉపాధ్యాయుడను. నా ఆధ్యాత్మిక జీవితం 2009వ సంవత్సరం లోనే ఆరంభమైనా, 2013వ సంవత్సరం వరకు కూడా అది నాకు తెలియకుండానే జరిగిపోయింది. 2009వ సంవత్సరం అంటే, నాకప్పటికి 33 సంవత్సరాలు. అప్పటికే నేను భగవంతుణ్ణి నేరుగా చూడాలని, ఆ భగవంతునిలో ఐక్యమైపోవాలని తీవ్రంగా ఆకాంక్షించే వాడిని.

2009వ సంవత్సరం ఆరంభంలో, నాతో పాటు చదువుకొని, ఉద్యోగంలో కూడా నాతో పాటే కలసి పని చేస్తున్న నా స్నేహితుడు మొదటిసారి శిరిడి తీసుకొని వెళ్లి హేమాత్పంత్ గారిచే రచింపబడిన 'శ్రీ సాయి సచ్చరిత్ర'ను నా చేతిలో పెట్టి నువ్వీ గ్రంథాన్ని చదువు అని అన్నప్పుడు, నాలో నేను ఇలా అనుకొన్నాను. అబ్బ, ఇంత పెద్ద గ్రంథాన్ని చదవటమా, ఎవడు చదువుతాడు? అని అనుకొన్నాను కానీ బయటపడలేదు. కానీ నేనప్పటికే బి.వి. నరసింహ స్వామి గారిచే ఆంగ్లంలో రచింపబడి తెలుగులో పింగళి సూర్యసుందరం గారిచే అనువదింపబడిన భగవాన్ శ్రీ రమణ మహర్షి యొక్క 'ఆత్మ సాక్షాత్కారం' అనే పుస్తకాన్ని చదివి ఉన్నప్పటికీ అది చదివినట్టు జ్ఞాపకం కూడా లేదు.

2005వ సంవత్సరం నుండి ఒక గొప్ప వ్యక్తితో తిరుగుతున్న

ప్పటికి కూడా, నేను ఎక్కువ సమయం ఒక మహాత్ముల కుటుంబం నుండి వచ్చిన వ్యక్తితోనే గడుపుతున్నానని నాకప్పటికి తెలియదు. ఆ వ్యక్తి నాకు ఉద్యోగంలో గురుతుల్యులు. వారు నన్ను తన సహోదరునిగా భావించి, వారు వేరొక చోట ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎంసెట్, ఏ.ఐ.ఈ.ఈ.ఈ., ఐ.ఐ.టి. శిక్షణను ఇస్తూ ఉండేవారు. అక్కడకు వచ్చి నా సబ్జెక్టు జ్ఞానాన్ని పెంపొందించు కోవలసినదిగా నన్ను ప్రోత్సహించేవారు. వారే శ్రీ ఎక్కిరాల సాయి బాబాగారు. ఎక్కిరాల వేదవ్యాస్ గారు వారి తండ్రి. వేదవ్యాస్ గారొక ఐఏఎస్ ఆఫీసర్. అలానే సాయిబాబాగారి చిన్నాన్నగారు ఎక్కిరాల భరద్వాజగారు. వారి పెద్దనాన్నగారు ఎక్కిరాల క్రిష్ణమాచార్య వారిని మాస్టర్ ఇ.కె. అని వారి శిష్యులందరూ పిలుస్తూ ఉంటారు. ఈ ముగ్గురి గురించి ఆంధ్ర మరియు తెలంగాణాలలో శిరిడి సాయిబాబా భక్తులకు తెలియని వారెవ్వరూ ఉండరంటే అతిశయోక్తి కాదు. కానీ విచిత్రమేమిటంటే శ్రీ సాయి బాబాగారు నాకు 2005వ సంవత్సరం నుండి పరిచయమున్నా, అప్పటికి వారి కుటుంబం గురించి నాకు పెద్దగా తెలియదు. వారు చాలా కాలం నాతో ఆధ్యాత్మిక చర్చలు జరిపేవారు కాదు. అలానే వారొక మహాత్ముల కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి అని నా స్నేహితుడు 2009వ సంవత్సరంలో నాకు చెప్పేవరకు కూడా, నాకు వారి కుటుంబం గురించి తెలియదు. వారింటికి నేను సబ్జెక్ట్‌లో నాకుండే సందేహాలను తీర్చుకోవటానికి వెళ్ళినప్పుడల్లా వారి తల్లి గారు నాతో మాట్లాడుతూ ఉండేవారు. వారు నన్ను పుత్ర

వాత్సల్యంతో చూస్తూ, నేను తిరిగి వచ్చేటప్పుడు ఏదో ఒక ఆధ్యాత్మిక గ్రంథాన్ని నా చేతిలో పెట్టేవారు. అలా వారి ద్వారా నాకొచ్చినదే భగవాన్ శ్రీరమణ మహర్షి యొక్క ఆత్మ సాక్షాత్కారం అనే పుస్తకం. ఆ పుస్తకాన్ని చదువుతున్నప్పుడు, భగవాన్ ఏ స్థితిని పొందారో, అటువంటి స్థితిని నేనెప్పుడు పొందగలను అని అనుకొనే వాడిని. కానీ అది చదవటం అయిపోయిన తరువాత మళ్ళీ యథాతథం. మాయ కమ్మేయటం వలన మళ్ళీ ప్రాపంచిక వ్యవహారాలలో పడిపోవటం. ఇలా 2009 సంవత్సరం వరకు జరిగింది.

2008వ సంవత్సరం నుండి ప్రతీ సంవత్సరం మా అన్నయ్య, నన్ను తిరుపతికి తీసుకొని వెళ్తూ ఉండేవాడు. నాకు తెలియకుండానే నేను స్వామి వారి ఎదుట నిల్చొని ఉన్నప్పుడు, నాకు స్వస్వరూప జ్ఞానాన్ని ఇవ్వమని ప్రార్థిస్తూ ఉండేవాడిని. అప్పటికి నాకసలు ఆ స్వస్వరూప జ్ఞానం అనే పదానికి అర్థం కూడా తెలియదు. స్వామి వారి ఎదుట నిల్చొని ఉన్నప్పుడు ఈ ఒక్క పదం తప్ప ఇంకేమి స్ఫురణలోకి వచ్చేది కాదు. 2009వ సంవత్సరాంతానికి అంతర్మథనం ఎంత తీవ్రమైందంటే 2010 జనవరిలో దిల్సుఖ్‌నగర్ దగ్గర గల గడ్డి అన్నారంలో ఉన్న శ్రీసత్యనారాయణ స్వామి వారి దేవాలయంలో కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద స్వామివారు ప్రవచనం చేస్తూ ఉండగా మధ్యలో లేచి నా గురువెవరు? అని ప్రశ్నించే స్థితికి చేరుకొన్నాను. ఆ సమయంలో సుమారు ఒక వెయ్యి మంది వరకు అక్కడ ఉండి ఉండవచ్చు. అలా ప్రవచనం మధ్యలో అడగవచ్చా? అది సరైన పద్ధతేనా కాదా?

అవన్నీ ఆ సమయంలో నాకేమీ తెలియదు. అంతరంగంలో ఏదో తెలియని ఉప్పెన, ఒక బడబాగ్ని. ఎవ్వరికి చెప్పుకోలేను. ఇది గమనించిన వారి శిష్యులు కొందరు మీరు స్వామివారిని కలుసు కోవాలని అనుకొంటున్నారా? అని అడిగారు. అవును, కలుసు కోవాలని అనుకొంటున్నాను అని అన్నాను. దానితో వారు నన్ను ఎప్పుడు, ఎక్కడ స్వామివారిని కలుసుకోవచ్చో తెలియచేసారు. అలా వారిని కలిసినప్పుడు వారు నాతో, నీకేమైనా మంత్రోపదేశం అయ్యిందా అని అడిగారు. నాకొకరు నారసింహస్వామి వారి మంత్రాన్ని ఉపదేశం చేశారని చెప్పటంతో, ఆ మంత్రాన్నే బాగా ఉపాసన చేయమని వారు నన్ను ఆదేశించారు. కానీ వారి ఆదేశం నాకు రుచించలేదు. ఆ తరువాత అదే నెల చివర్లో శ్రీ పరిపూర్ణా నంద సరస్వతి స్వామివారు దిల్సుఖ్‌నగర్‌లోని పుల్లారెడ్డి ఉన్నత పాఠశాల లోని మైదానంలో ఉదయం మరియు సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలను ఇస్తున్నారని తెలుసుకొని అక్కడకు వెళ్లాను.

క్రితంలో కలిగిన అనుభవంతో, ఆ స్వాములకు శిష్యులు, భక్త బృందం ఉంటుందని అర్థమవటంతో స్వామివారి వ్యక్తగత కార్యదర్శిని కలుసుకొని నేను స్వామివారిని వ్యక్తిగతంగా కలుసు కోవాలనుకొంటున్నాను అని వారితో అన్నప్పుడు, మీరు పుస్తక విక్రయశాలలో వారం రోజులు సేవ చేయండి. వారం చివర్లో చూద్దాం అని అన్నారు. అలా వారి పీఠంలో వేదాన్ని అభ్యసించే విద్యార్థులను ప్రతీ ఉదయం మరియు సాయంత్రం ప్రవచనాల

అనంతరం, స్వామి వారు బస చేస్తున్న చోట దించటం జరిగేది. చివరి రోజున ఎక్కడైతే స్వామివారు బస చేస్తున్నారో ఆ ఇంటి యజమాని నా దగ్గరకొచ్చి, ఏమోయ్ స్వామివారిని కలవాలను కొంటున్నావట, ఇవాళ కలుస్తావా? అని అడిగారు. దానికి నేను కలుస్తానని చెప్పటంతో, వారు ఆ ఉదయం స్వామివారి ప్రవచనాల అనంతరం మా ఇంట్లో కలుద్దువుగాని అని చెప్పారు. అలా వారింటికి వెళ్లి కూర్చొన్నాను. ఉదయం 8.30 నుండి 10.30 వరకు వివిధ భక్తులు వారి వారి సమస్యలను స్వామివారికి విన్నవించుకొని వెళ్ళిపోయిన తరువాత నేనొక్కడినే అక్కడ మిగిలాను. అప్పుడు స్వామివారు తమ శిష్యులతో వారి పీఠం నుండి తెచ్చుకొన్న స్ఫటిక లింగాన్ని పానవట్టంలో అమర్చి అభిషేకం మొదలు పెట్టారు. ఆ అభిషేకం దాదాపుగా ఒక గంటన్నర వరకు జరిగి ఉండవచ్చు. అభిషేకం అంతా అయిపోయిన తరువాత, నెమ్మదిగా నీకేం కావాలి? అని అడిగారు.

నేనప్పుడు వారితో నాకు మీరు భగవంతుని దర్శింప చేయ గలరా? నా స్వస్వరూప జ్ఞానాన్ని నాకు తెలియజేయగలరా? అని అడిగి నేను సత్యం ఏంటో తెలుసుకోవాలని అనుకొంటున్నాను. దాన్ని గురించి మాత్రమే మాట్లాడేదైతే నేను ఈ చర్చను కొనసాగిస్తాను లేదంటే వెళ్ళిపోతాను అని ఖరాఖండిగా చెప్పాను. అలానే మీరు నాకు సన్యాసాన్ని ఇస్తారా అని కూడా అడిగాను. ఇక్కడ కూడా నేనొక స్వామివారితో మాట్లాడుతున్నాను, అలా మాట్లాడవచ్చా లేదా అని ఆలోచించలేదు. ఎందుకంటే నాకు

సత్యం ఏంటో తెలుసుకోవాలనే తాపత్రయం తప్ప ఇంకేమి తెలియని స్థితిలో ఉన్నాను. ఇదంతా విని, రేపు ఉదయం నేను మహబూబ్ నగర్ వెళ్తున్నాను. నువ్వు రాదలచుకొంటే నాతో నా కార్లో రావచ్చు అని అన్నారు. ఇదంతా జరిగేటప్పటికే దాదాపుగా మధ్యాహ్నం 1.30 అయి ఉండవచ్చు.

ఇదంతా జరగక ముందు నుండే మా అమ్మగారితో, నేను సన్యాసం తీసుకొంటాను అని చెప్తూ ఉండేవాడిని. మా అమ్మగారు నీవు సన్యాసం తీసుకొంటావా? అని నన్ను ఆటపట్టిస్తూ ఉండే వారు. మా అమ్మగారు నేను చెప్పే మాటలను అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఏ రోజైతే స్వామివారు తనతో వచ్చేయవచ్చు అని అన్నారో ఫిబ్రవరి 10, 2010, ఆ రోజున నేను ఇంటికి వచ్చి, రేపు ఉదయం స్వామివారితో వెళ్లిపోతున్నానని చెప్పానో, మా అమ్మగారి నెత్తిన పిడుగు పడ్డట్టయి, నన్ను తీవ్రంగా మందలించటం మొదలు పెట్టారు. ఈ తతంగాన్నంతా మా నాన్నగారు గమనిస్తున్నారే కానీ ఆ రోజున వారు నన్ను ఏమీ అనలేదు. మా అమ్మగారు తీవ్రంగా మందలించటంతో నేను ఆ రోజంతా పడుకొన్నట్టు నటిస్తున్నానే కానీ లోలోపల ఆందోళన చెందుతూ, ఏమవుతోందో అర్థంకాని స్థితిలో ఎప్పటికో నేను నిద్రలోకి జారుకొన్నాను. తెల్లవారి నేను లేచేటప్పటికే సమయం 9 గంటలు కావొస్తోంది.

సాధారణంగా నా దినచర్య ఉదయం నాలుగు గంటలకు మొదలై 5.45 కల్లా సంధ్యావందనాది కార్యక్రమాలు పూర్తి చేసుకొని దగ్గరలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామివారి మందిరంలో సుప్రభాతం

చెప్పటానికి వెళ్లిపోయేవాడిని. అలాగే ప్రతిరోజు రాత్రి 9 గంటలకు స్వామి వారి పవళింపు సేవలో పాల్గొనటంతో నా దినచర్య పూర్తయ్యేది. అలాంటిది క్రితం రోజు రాత్రి నేను పవళింపు సేవలో పాల్గొనక పోవటం, మరుసటి రోజు సుప్రభాతం చెప్పటానికి వెళ్లక పోవటాన్ని గమనించిన మా నాన్నగారు, నేను మొహం కడుక్కున్న తరువాత నాతో మాట్లాడటం ఆరంభించి ఇలా అడిగారు. నువ్వు నడుములోతు నీళ్ళు వచ్చేంత వర్షం పడినా ఏ రోజు వేంకటేశ్వర స్వామివారి సేవను వదిలి పెట్టేవాడివికాదు. అలాంటిది ఈవేళ నీకేమైంది? అని అన్న తరువాత నేను నిన్ను కొన్ని ప్రశ్నలడుగు తాను. వాటికి సమాధానం చెప్పిన తరువాత నీవేమి చేయదలచు కొంటే అది చేయవచ్చు అని ఇలా అడగటం మొదలుపెట్టారు.

మొదటి ప్రశ్న: శ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వామి ఒక ప్రొఫెసర్ అని అనుకొంటే, నువ్వు ఆధ్యాత్మికంగా ఏ స్థాయిలో ఉన్నావో నీకు తెలుసా? ఒకటవ తరగతిలోనా, లేదా, డిగ్రీనా లేదా పి.జి. లోనా అని అడిగారు.

రెండవ ప్రశ్న: నీవెళ్ళ దలచుకొన్న స్వామివారి పూర్వాపరాలు నీకేమైనా తెలుసా?

మూడవ ప్రశ్న: తెర ముందు కనిపించేదంతా సత్యమని భావించి నువ్వు వెళ్తానంటున్నావు. తెర వెనుక ఏమి భాగవతం నడుస్తోందో నీవెప్పుడైనా గమనించే ప్రయత్నం చేశావా? అని అడిగారు.

బురదలో ఇరుక్కున్న తరువాత బయటపడటం చాలా కష్టమని హెచ్చరించి, అదే సమయంలో స్వామి నిత్యానంద లీలలు, సత్యసాయిబాబా చివరి రోజులలో ఉన్నారని, వారికి వారి దగ్గరి బంధువే విషం ఇచ్చారని, అనంతపురంలోని సత్యసాయి నిలయం నుండి పెట్టెలలో బంగారం తరలిపోతోందని, అలానే పిరమిడ్ ధ్యానాన్ని గురించి ప్రవచించే పత్రీజీ గారి మీద హత్యారోపణలు, కల్కి భగవాన్ మీద ఆరోపణలు ఇలా ఎన్నో ప్రసార మాధ్యమాలలో కోకొల్లలు ప్రసారమవటాన్ని గమనించవలసినదిగా మా నాన్నగారు నాకు సూచించారు.

దాంతో ఏది సత్యమో, ఏది అసత్యమో అర్థం కాని అయోమయ స్థితిలో పడిపోయాను. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో చాలా సతమత మయ్యే వాడిని. సత్యాన్ని అన్వేషించి తెలుసుకోవాలన్న తీవ్రమైన ఇచ్ఛతో ఉన్న నేను ఉద్యోగాన్ని కూడా వదిలివేశాను. ఉద్యోగాన్ని వదిలివేయటం వలన ఎక్కువ సమయం నాకు మంత్రోపదేశం చేసిన సిద్ధాంతి గారితో గడుపుతూ ఉండేవాడిని. వారు నన్ను వారితో పాటు పూజలకు, హోమాలకు, యాగాలకు, ప్రాణప్రతిష్టలకు తీసుకొని పోతూ ఉండేవారు. అయినా ఏదో తెలియని వెలితి, నేను తెలుసుకోవాలనుకొన్న సత్యాన్ని తెలుసుకోలేక పోతున్నానన్న బాధ.

సమయం దొరికినప్పుడల్లా ఎక్కిరాల భరద్వాజ గారు రచించిన శ్రీ గురుచరిత్రను, అలానే శ్రీ వాసుదేవానంద సరస్వతి

(టేంబే స్వామీ) స్వామివారిచే రచింపబడిన శ్రీగురు చరిత్రను నిరంతరాయంగా పారాయణ చేస్తూ ఉండేవాడిని. ఇలా జరుగుతున్నప్పుడు చిన్మయా మిషన్ నుండి బ్రహ్మచారి ఒకరు, శ్రీమద్భగవద్గీత మీద ప్రవచనాలను ఇవ్వటానికి నేను వెళ్ళే గుడికి వస్తూ ఉండేవారు. ప్రవచనాల అనంతరం వారిని కలసి ఎన్నో ప్రశ్నలను వేస్తూ ఉండేవాడిని. ఒకరోజున విసుగు చెందారో ఏమో, వారిలా అన్నారు. చిన్మయ ధ్యాన మందిరంలో రేపు స్వామీ స్వరూపానంద గారి ప్రవచనాలు ఉన్నాయి, అక్కడికిరా అని చెప్పి వెళ్ళిపోయారు. అలానే అని చెప్పి మరుసటి ఉదయం స్వామీ స్వరూపానందగారి ప్రవచనాల అనంతరం వారిని కలుసుకుందామని ప్రయత్నిస్తున్నప్పుడు, అక్కడే పనిచేస్తున్న విద్యాలయ అప్పటి ప్రిన్సిపాల్ (నాతో పాటు హెచ్.పి.ఎస్. బేగంపేట్‌లో క్రితంలో కలసి పనిచేశారు) శ్రీమతి రజనీగౌరీ శంకర్‌గారు నన్ను చూసి, రవి నువ్విప్పుడేం చేస్తున్నావు? అని అడిగితే, నేనేమి చెయ్యట్లేదు, ఖాళీగానే ఉన్నాను అని చెప్పాను. అప్పుడు వారు, మాకిక్కడ భౌతిక శాస్త్రం చెప్పే ఉపాధ్యాయుని కొరత తీవ్రంగా ఉన్నది, నీవొచ్చి చేరరాదా అని అడిగారు. నేనప్పుడు వారితో మేడం, నేనిప్పుడు ప్రాపంచిక వ్యవహారాలలో ఉండాలని కోరుకోవటం లేదు. కాబట్టి నన్ను వదిలి వేయండి అని చెప్పి, నేనక్కడికి వచ్చిన సందర్భం వేరు, స్వామివారిని కలవటానికి వచ్చాను అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాను. స్వామివారిని కలిసే సమయం మించిపోవటంతో వారిని కలవలేక పోయాను. *(సశేషం)*

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

ఆ తరువాత, శ్రీ భగవాన్ వాళ్ళ దగ్గరనుండి బయలుదేరి గిరి ప్రదక్షిణగా వెళ్ళసాగారు. (శ్రీ భగవాన్ గిరి ప్రదక్షిణ చాలా నెమ్మదిగా చేసేవారు. అక్కడక్కడా ఆగుతూ నడవటంతో ఒక్కోసారి రోజంతా పట్టేది). కొన్ని మైళ్ళు వెళ్ళినాక మధ్యాహ్న సమయానికి, ఆ స్త్రీలు మళ్ళీ కనిపించారు. వాళ్ళు అప్పటిదాకా కూడా ఆకులు కానీ, వంటచెరుకు కానీ పోగుచేయకపోవడాన్ని చూసి శ్రీ భగవాన్ ఆశ్చర్యపోయారు. "నేను వారిని ఉదయం చూసినప్పుడు ఆకు పోగు చేసుకునే వారేమో అనుకున్నాను కాని వాళ్ళ సంచులు అన్నీ ఖాళీగా వుండటం చూశాను" అన్నారు మాతో.

"మేమిప్పుడు మధ్యాహ్న భోజనం చేయబోతున్నాము. మాతో బాటు స్వామి కూడా కరుణించి కొంచెము భుజించాలి", అని బతిమాలారు ఆ స్త్రీలు.

అలా అంటూ, ప్రతి స్త్రీ శ్రీ భగవాన్‌కు కొంచెము కొంచెము ఆహారము ఇవ్వగా, వారికి తినక తప్పలేదు. ఈ వ్యవహారము అక్కడితో ఆగలేదు. ఆ స్త్రీలను వీడి శ్రీ భగవాన్ ముందుకు సాగగా, కొంచెం సేపటికి శ్రీ భగవాన్ భక్తులందరిలో చాలా పెద్దవారైన శ్రీరామస్వామి అయ్యర్ ఎదురొచ్చారు. వారి చేతుల్లో తిను పదార్థాలూ శ్రీ భగవాన్ కోసం ఎంతో భక్తితో ప్రత్యేకంగా తయారు చేసిన రసము వున్నాయి. ఆ రోజున వారికి ఒక పెద్ద మామిడి

పండు దొరికితే, దానిని వాడి రసం తయారు చేసిన ఎడల చాలా రుచిగానూ శ్రీ భగవాన్‌కు పోషకంగానూ వుంటుందనిపించి, రసాన్ని తయారుచేసి స్కందాశ్రమం తీసుకువెళ్ళారు. శ్రీ భగవాన్ ప్రదక్షిణకు వెళ్ళారని తెలుసుకొని, దారిలో ఎక్కడైనా వారిని కలుసుకోవచ్చని, ఆయన అప్రదక్షిణగా నడవడం మొదలుపెట్టారు. మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీ భగవాన్‌ను కలవగలిగారు. తన కోసం శ్రీరామస్వామి అయ్యరుగారు తీసుకున్న శ్రమ విన్నాక ఆయన తెచ్చిన భోజనం 'తినను' అని చెప్పలేక పోయారు శ్రీ భగవాన్. అలా ఏమీ తినకూడదనుకున్న శ్రీ భగవాన్ ఆ రోజు మూడుసార్లు సుష్టుగా భోజనం చేయవలసి వచ్చింది.

"ఆ రోజు ఉపవాసం వుందామని తలిస్తే, జరిగిందిది అన్నారు" శ్రీ భగవాన్. తనదంటూ యెట్టి సంకల్పమూ లేకుండా, భగవంతుని వద్ద సంపూర్ణ శరణాగతి పొందారు శ్రీ భగవాన్. ఉపవాసం లాంటి చిన్న విషయంలో కూడా భగవంతునికి అసూయ కలిగినట్లున్నది. "భోజనము చేస్తావా, లేదా అని నిర్ణయించుటకు నీవెవరవు? నన్ను పూర్తి శరణాగతి కోరలేదా? నీవు భోజనము చేస్తావా లేదా అని నిర్ణయించాల్సింది నేను", అనుకుని వుంటాడు భగవంతుడు!

వారు అంత విశదీకరించి ఆ కథ చెప్పినప్పుడు, శరణాగతి-సంపూర్ణ శరణాగతి యొక్క అవసరము గురించి శ్రీ భగవాన్ నొక్కి వక్కాణిస్తున్నట్లుగా తోచింది నాకు.

శ్రీ భగవాన్‌ను కలిసిన స్త్రీలు సప్తకన్యకలని కొందరి భక్తుల నమ్మకము. వారు మొదట శ్రీ భగవాన్‌ను కలిసిన దగ్గరే సప్తకన్యకల

గుడి వున్నది. వారో కాదో అన్నది అంత ముఖ్యము కాదు. వారెవరై నప్పటికీ, భగవత్సంకల్పము ప్రకారము రావడమూ, శ్రీ భగవాన్‌కు భోజనము పెట్టడమూ జరిగింది.

ఇంకొకసారి శ్రీ భగవాన్ గిరి ప్రదక్షిణ చేస్తున్నప్పుడు, నేల నుండి మనిషి ఎత్తున వున్న కొన్ని తేజోమయమయిన ఆకారాలు తనతో బాటు ప్రదక్షిణ చేయడం చూశారు. మరోసారి, ప్రదక్షిణ చేస్తూ అడి అణ్ణామల గుడిలోనికి వెళ్ళినప్పుడు, గర్భగుడిలో సామవేద గానం వినిపించింది. శ్రీ భగవాన్‌తో బాటు ప్రదక్షిణ చేస్తున్న ఇతరులు కూడా ఆ కాంతిపుంజములను చూడటం, సామవేదం వినడం జరిగిందా అని నేను ప్రశ్నించగా "లేదు", అని సమాధానమిచ్చారు శ్రీ భగవాన్. అనేకమంది సిద్ధ పురుషులు అరుణాచల పర్వతము మీద నివసిస్తూ వుంటారనీ, అప్పుడప్పుడు గిరి ప్రదక్షిణకు వెడుతూ వుంటారనీ చాలా మంది నమ్ముతారు. అందువల్ల, ఆ కాంతి పుంజముల గురించీ నేను ప్రత్యేకముగా శ్రీ భగవాన్‌ను ప్రశ్నించలేదు. వారు శ్రీ భగవాన్‌తో కూడి గిరి ప్రదక్షిణ చేయడంలో ఆనందాన్ని అనుభవిస్తారని నేను భావించాను.

శ్రీ భగవాన్ కొండమీద నివసిస్తున్న సమయంలోనే జరిగిన సంఘటన ఒకటి నాకు గుర్తు వస్తున్నది. ఈ విషయం శ్రీ భగవాన్ స్వయంగా తానే తెలియచేశారు. ఒకసారి చాలా అందంగా వున్న ముంగీస ఒకటి శ్రీ భగవాన్ దగ్గరకు పరుగున వచ్చి, ఆయన ఒళ్ళో ప్రేమగా కూర్చొని వెళ్ళిపోయిందిట. "ముంగీస ప్రవర్తనకు శ్రీ భగవానే ఆశ్చర్యపోయారట." వారెవరైనా కానీ సామాన్య

ముంగీస మాత్రము కాదు. ఏ ముంగీసైనా అంత నిర్భయంగా మనుషుల దగ్గరకు వస్తుందా? మళ్ళీ అందులో కూడా అక్కడ అంతమంది వుండగా నన్నే ఎందుకు ఎంచుకున్నట్లు?'' అన్నారు శ్రీ భగవాన్.

వారు అంతే చెప్పినప్పటికీ, చాలా మంది భక్తులు శ్రీ అరుణాచలేశ్వరుడు స్వయంగా కానీ లేక సామాన్య మానవులకు కనిపించని ఎవరో సిద్ధపురుషుడు కానీ ఆ ముంగిస రూపంలో శ్రీ భగవాన్ వద్దకు వచ్చి వుంటారని నమ్ముతారు. ఎవరు నమ్మినా నమ్మకపోయినా, ఈ విషయం చెప్పకపోవడం నా లోపమవు తుందని భావించి ఆ సంఘటన తెలియపరుస్తున్నాను.

దీని తరువాత ఇంకొక విచిత్రమయిన ఘటన గురించి తెలియ పరచాలి. శ్రీ భగవాన్ స్కందాశ్రమంలో వుండేటప్పుడు, ఒక వేసవిలో, మిట్ట మధ్యాహ్న సమయంలో అరుణాచలం మీద సంచరిస్తున్నారు. వారు ప్రస్తుతం ఆశ్రమం వున్న ప్రాంతానికి వచ్చినప్పుడు ఒక వృద్ధ వనిత, బహుశా యేదో నిమ్నజాతికి చెందిన స్త్రీ, శ్రీ భగవాన్ దగ్గరకు వచ్చి, ప్రేమతో నిండిననూ, చాలా పరుషమయిన భాషలో, ''ఆశ్రమంలో నీడ పట్టున కూర్చోక ఎందుకీ ఎండలో తిరుగుతున్నావు?'' అని మందలించింది. ఆమె అన్న మాటలు - నాకు గుర్తున్నంత వరకూ-

'నీ పాడె కట్టా! ఎండలో యీ రాళ్ళల్లో రప్పల్లో,

ముళ్ళలో తిరగకపోతే ఒక చోట నీడ పట్టున కూచోరాదా?''

ఈ సంఘటన గురించి శ్రీ భగవాన్ ఇలా అన్నారు, ఆమె పుల్లలు యేరుకునే సామాన్య నిమ్న జాతి స్త్రీ కాదన్నది సుస్పష్టము. ఒక సామాన్య స్త్రీ స్వామితో అలా మాట్లాడకలదా? చాలామంది భక్తుల ఉద్దేశములో, శ్రీ భగవాన్ తండ్రి అరుణాచలేశ్వరులు కానీ, వేరొక సిద్ధ పురుషులు కానీ ఆ హరిజన స్త్రీ రూపములో వచ్చి శ్రీ భగవాన్‌ను మందలించి వెళ్ళారని నమ్మిక. (సశేషం)

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింపబడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

---

## శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ దిలీప్ కుమార్ రాయ్

**మల్లాది ఫణిమాల**

శ్రీ అరవింద ఆశ్రమవాసి అయిన దిలీప్ కుమార్ రాయ్ గారు సుప్రసిద్ధ శ్రీరమణ భక్తులలో ఒకరు. వారు గొప్ప గాయకులు, బహుగ్రంథకర్త మరియు గొప్ప భక్తులు కూడా.

శ్రీ దిలీప్ కుమార్ రాయ్ శ్రీ రమణుల గురించి మొట్టమొదటిసారి అరవిందుల ఆశ్రమమునందు విన్నారు. శ్రీరమణ మహర్షుల వారి గురించి శ్రీ అరవిందుల వారిని అడుగగా, వారు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానం ఇది - "శ్రీరమణులు అత్యున్నత స్థాయికి చెందిన యోగులు!" వారి తపశ్శక్తి భారత

దేశానికి వన్నె తెచ్చింది. శ్రీరమణులు యోగులలో మేరువు అని అరవిందుల వారు శ్రీరమణులను కీర్తించి కొనియాడారు.

'భక్తి జ్ఞాన మాత' అనే సుప్రసిద్ధ మహా వాక్యం దిలీప్ కుమార్ రాయ్ గారు అడిగిన ప్రశ్నకు జవాబుగా శ్రీ రమణుల నోటి వెంట వెలువడింది. శ్రీరమణులు భక్తికి తక్కువ స్థాయిని ఆపాదించి జ్ఞానానికి ప్రాధాన్యత ఇస్తున్నారా అని దిలీప్ కుమార్ గారు ప్రశ్నించగా, 'భక్తి జ్ఞాన మాత' అని సమాధానమిచ్చారు. శ్రీ రమణులు తద్వారా భక్తి లేనిచో జ్ఞానము సిద్ధించదనియు, జ్ఞానమునకు, భక్తి మాతృస్థానంలో ఉండునని శ్రీరమణులు వివరించి చెప్పారు.

తొలిసారిగా శ్రీ రమణాశ్రమానికి వచ్చిన తరుణంలో తన గురువు దగ్గర పొందలేని శాంతిని శ్రీరమణుల పాదాల చెంత ఎలా పొందగలనని వాపోయారు, శ్రీ దిలీప్ కుమార్ రాయ్. అయినప్పటికీ ప్రపంచంలోని ముముక్షువులందరిచేత ఆదరింపబడి, ఆరాధింపబడే శ్రీరమణుల చెంతకు చేరినందుకు ఆధ్యాత్మిక సాధనకు కావలసిన ప్రేరణ, స్ఫూర్తి తనకు అనుగ్రహింపబడతాయనే నమ్మకంతో, శ్రీరమణుల సన్నిధిలో ఉండటం ఒక ఆశీర్వాదంగా దిలీప్ కుమార్ గారు భావించారు.

శ్రీ దిలీప్ కుమార్ రాయ్ శ్రీ రమణాశ్రమములో శ్రీ రమణులు కొలువుతీరిన హాలులోనికి తొలిసారిగా ప్రవేశించినప్పుడు శ్రీ రమణుల గురించి వారికి కలిగిన భావనను ఈ మాటలలో

వ్యక్తపరచారు. శ్రీ రమణాశ్రమములోని హాలునందు కొలువుతీరిన అపర జ్ఞానావతారమైన శ్రీ రమణులు అద్వైత చక్రవర్తిలా నాకు గోచరించారు. వారి దర్శనాన్ని కాంక్షించి వారి పాదాల చెంతకు వచ్చిన వారెవరైనా సరే... అందరినీ సమభావనతో, తేడాలు -భేదాలు లేకుండా ఆశీర్వదించి, అనుగ్రహిస్తారు. శ్రీరమణులు అందరినీ అనుగ్రహిస్తారు కానీ ఎవరికీ చెందరు. ఆయనకి అన్నిటి పట్ల ఆసక్తి ఉంటుంది. కానీ దేని పట్ల మమకారం మాత్రం ఉండదు. లోకచింతనతో నిండి ఉన్న మనం తాపత్రయపడే వారి పట్ల శ్రీరమణులు పరిపూర్ణమైన నిరాసక్తతతో ఉంటారు.

దర్శనార్థమై వచ్చినవారికి శ్రీరమణులు సాక్షాత్ శివునివలె గోచరించి, వారిపై సంపూర్ణ కృపను వర్షించారు. కేవలం కౌపీనము మాత్రమే ధరించి, ప్రపంచ విషయములలో ఏ మాత్రం ఆసక్తి లేకుండా, అహంభావరహిత బ్రహ్మానంద స్థితిలో రమించుచున్న శ్రీ రమణులను దర్శించిన వారి భాగ్యమేమని వర్ణించగలము!"

హాలులోనికి ప్రవేశించి, శ్రీ రమణులను సమీపించి, వారి పాదాలను స్పృశించి వారి సన్నిధిలో ధ్యానంలో కూర్చున్నారు దిలీప్ కుమార్ రాయ్. వారు ధ్యాన స్థితిలో ఎన్నడు ఎరుగని పరమశాంతిని, ఆనందాన్ని పొందడం విశేషం. కొన్ని గంటలపాటు ఈ ధ్యాన స్థితిలో వారు ఉండిపోవడమే కాకుండా హృదయం లోతుల్లోకి వెళ్లి అంతులేని శాంతిని అనుభవించారు. ఇంతటి శక్తివంతమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని మాటలలో వర్ణించడం సాధ్యం కాదని శ్రీ దిలీప్ కుమార్ రాయి అన్నారు. సాధికారికము,

సుస్పష్టము, తీవ్రము అయిన ఆధ్యాత్మిక అనుభూతిని వర్ణించడానికి వాక్కు నిరర్థకం కదా!!

ఇటువంటి గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని చవి చూసిన పిమ్మట నక్షత్రములు మెరిసే నింగి క్రింద వాలు కుర్చీలో ప్రశాంత చిత్తులై కూర్చుని ఉన్న తరుణంలో ఆనందభాష్పాలు వారి కంటి వెంట జాలువారినప్పుడు దిలీప్ కుమార్ రాయ్ గారికి శ్రీరమణుల పట్ల ప్రగాఢమైన కృతజ్ఞత కలిగింది. ఇలా వారి హృదయంలో కృతజ్ఞత అంకురించినప్పుడల్లా శ్రీరమణులు పలికిన దివ్య ఉపదేశము వారికి జ్ఞాపకం వచ్చేది. ''ఊరికే ఉండు అన్నీ నీలోనే ఉన్నాయి! ఒక తెర నిన్ను వేరుపరుస్తోంది. ఆ తెరని చీల్చివేయటమే నీవు చేయవలసినదంతా అంతే!'' అని శ్రీరమణులు అన్న భావగర్భితమైన మాటలు శ్రీరాయ్‌ని ఎన్నడూ ఎరుగని ఆనందంలో ముంచెత్తేసేవి. శ్రీరమణుల స్వాతిశయరాహిత్యము దిలీప్ కుమార్ రాయ్‌ని ముగ్ధుల్ని చేసింది. సంధ్యవేళ మేఘానికి సొగసు ఎంత సహజమైనదో మహనీయత శ్రీరమణులకు అంతే సహజమైనది... అని దిలీప్ కుమార్ రాయ్ విశ్వసించారు. శ్రీ రమణాశ్రమమునందు గడిపిన ప్రతి క్షణములో శ్రీ రమణులను వీక్షించుచుండగా, మహనీయులు ఎలా ఉండాలో వారు ఎటువంటి ఉన్నత జీవితాన్ని గడపాలో - దానికి ప్రత్యక్ష నిదర్శనంగా శ్రీరమణులు గోచరించేవారు. శ్రీరమణుల వంటి నిరుపమానమైన మహా ఋషిని ఈ విశాల ప్రపంచంలో మరెక్కడా చూడలేమని దిలీప్ కుమార్ రాయ్ అనేవారు.

శ్రీరమణుల వదనాన్ని విద్యుత్ దీపకాంతులలో దర్శించి నప్పుడల్లా దిలీప్ కుమార్ రాయ్ ఎంతగానో చలించిపోయే వారు. ''పూలు నెత్తావిని విరజిమ్మినట్లు, శ్రీరమణులు ఆధ్యాత్మిక పరిమళాన్ని వెదజల్లుతారు'' అన్న పాల్ బ్రంటన్ భావం తరచూ దిలీప్ కుమార్ రాయ్ గారు జ్ఞాపకం తెచ్చుకుని, శ్రీ రమణులను హృదయంలో ఆరాధిస్తుండేవారు. శ్రీరమణుల సమక్షంలో అనేక సార్లు దిలీప్ కుమార్ రాయ్ గానం చేశారు. అలా గానం చేసిన ప్రతిసారి కరుణాపూరితమైన శ్రీ రమణుల దృక్కుల వల్ల, భక్తులను ముగ్ధులను చేసే వారి దరహాసం వల్ల చలించిపోయి ప్రశాంత సాగరంలో మునిగి పోయేవారు శ్రీ రాయ్. 'పవిత్రము' అనే పదానికి నిజమైన అర్థం ఏమిటో దిలీప్ కుమార్ రాయ్ గారికి శ్రీ రమణులను దర్శించినప్పుడు వారి సన్నిధిలో కూర్చున్నప్పుడు అర్థమైంది.

లోకపు బాధలకు, ఆక్రందనలకు ఆవల ప్రకాశించే సత్య స్వరూపమును కొద్దిమందే అందుకోగలరు. సదా ఆత్మ నిష్ఠలో రమించే శ్రీ రమణుల దర్శనమయిన వాళ్ళకి ఆవలి ఒడ్డున గల ఆనందం కొద్దిగా గోచరమవుతుంది! కాదు, కాదు! ఆ ఆనందం ఇక్కడే ఉన్నది అని శ్రీ రమణా, ''నీవు ఎంత కరుణతో వాగ్దానం చేసినా బహుకొద్దిమంది భాగ్యశాలులకే కదా ఆ సత్యం అర్థమవుతుంది. ప్రశాంత నిర్మల మూర్తీ.... అందుకో నా నివాళులు...'' అంటూ శ్రీ దిలీప్ కుమార్ రాయ్ గారు చక్కటి కవితాసుమాలతో శ్రీరమణులకు అక్షర పూజ చేసుకుని తరించారు.

## Seek the Seeker

Talk No.57

Dr K Subrahmanaian

What we all would like to experience is permanent happiness. In our everyday life, we are happy for some time; then, it is followed by a period of unhappiness and sorrow. We seek permanent happiness, and each one of us tries to achieve it through different means - money, knowledge, power, children, etc. Each one tries to derive happiness in his own way. After a constant struggle, we realise that even though we may be better off than other people in some respects, we are no better than some others, as far as happiness is concerned.

Some people tell us we can find happiness in *puja, japa* and *dhyana*. We try it for some time, and then we find it doesn't give us happiness. We turn our attention to lectures and books, and still, we are not satisfied. Why is it that we are not satisfied? There are many people who appear to be happy all the time, and we would like to know the secret of their permanent happiness. In fact, some of these happy people wish to share the secret of their happiness. This willingness to share with everyone - not just with the people close to them - is truly extraordinary. You and I, for example, when we eat something or get a lot of money, we generally don't want to share what we have with others. If we have a lot of money, we want more. We are not satisfied with what we have - that's because we compare ourselves with others who have more than we

do. As a result, we work hard and continue to earn more money. What for? Do we need that money? Does it bring more happiness? No, it doesn't; but having it gives great satisfaction to our ego. We can proudly tell other people that we are the richest person in the Twin Cities, in India, or the whole world.

Each one tries to satisfy his ego in some way. Some may say that they have studied the *Vedas* and the *Upanishads* thoroughly; so, they can talk about spirituality and Shankara at length. In other words, our knowledge also strengthens or boosts our ego. We use money and knowledge for the same thing - to gain recognition for ourselves. We want to be talked about by other people as a great writer, a great speaker, a wealthy person, a philanthropist, etc. We want the public to talk about the vast sums of money we give to a number of charitable institutions. Each one of us wants to be a somebody; we want recognition for something or the other. There is no one here who wants to be a nobody.

Unless we are extraordinarily careful, our minds are likely to be influenced by praise - whether it be subtle or crude. We take pride in saying, "I don't like flattery," but when somebody tells us, "Sir, I won't flatter you because I know that you don't like flattery," we are unconsciously flattered without our being aware of it. The mind is an extraordinarily subtle instrument, and if we want to understand how it works, then we cannot understand it with the help of the mind. In other words, we cannot use the mind to understand the mind. To do so, would be like

